నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | వరంగల్, సోమవారం 14 ఏప్రిల్ 2025 | MAHABUBABAD



సభాస్థలిని పరిశీలిస్తున్న శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

# రజతోత్సవం కోసం దేశం ఎదురుచూస్తోంది

**కేసీఆర్‌ది నిర్మాణాత్మక పాలన.. రేవంత్‌ది దుర్మార్గ పాలన**

- ఢిల్లీకి కప్పం కట్టుడే ముఖ్యమంత్రి లక్ష్యం
- ఎల్కతుర్తి మహాసభకు లక్షలాదిగా తరలిరావాలి
- శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి
- మాజీ ఎమ్మెల్యే వొడితెలతో కలిసి ఏర్పాట్ల పరిశీలన





ఎల్కతుర్తి, ఏప్రిల్ 13 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ కోసం యావత్ దేశం ఎదురుచూస్తున్నదని శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌తో కలిసి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. సభా ప్రాంగణం, పార్కింగ్ తదితర విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సిరికొండ మాట్లాడుతూ ఎలాంటి హింసకు తావులేకుండా రాజ్యాంగబద్ధంగా తెలంగాణను సాధించిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. ప్రత్యేక రాష్ర్టాన్ని సాధించిన తదనంతరం సీఎంగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ నిర్మాణాత్మక పాలన కొనసాగిస్తే.. 16 నెలలుగా రేవంత్‌రెడ్డి దుర్మార్గపు, రాక్షస పాలన నడుస్తున్నదని మండిపడ్డారు. చైనాలోని గోబి ఎడారి తర్వాత పదేండ్ల కాలంలో కోట్లాది మొక్కలు నాటిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అయితే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రాతో ఇండ్లు కూల్చడమే కాకుండా హెచ్‌సీయూలో చెట్లను తొలగిస్తూ అరాచక పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో తాగు, సాగు నీటికి కొరత లేదని, అనేక రంగాల్లో నిర్లక్ష్యానికి గురైన తెలంగాణను అభివృద్ధి చేశారని, కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చి పాత సమస్యలను సృష్టిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలవి కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాల్సిన బాధ్యత ప్రజల తరఫున బీఆర్‌ఎస్‌కు ఉందని, హామీల అమలు కోసం ఈ సభ నాంది పలుకుతుందన్నారు. హామీలను విస్మరించి ఢిల్లీకి కప్పం కడుతున్న రేవంత్‌రెడ్డి సర్కారుకు ఈ సభ చెంపపెట్టులా మారుతుందని, ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక అవుతుందని అన్నారు. గతంలో ఏ సభైనా పరేడ్ గ్రౌండ్స్‌లో జరిపేవారని, ఇప్పుడు ఎల్కతుర్తిలో 1200 ఎకరాల్లో జరుగుతున్న సభ 25 పరేడ్ గ్రౌండ్స్‌తో సమానమని అభిప్రాయపడ్డారు. 4 కోట్ల ప్రజలున్న తెలంగాణలో నిర్వహిస్తున్న ఈ సభ చరిత్రాత్మకంగా నిలుస్తుందని, ఇలాంటి సభలు కేవలం కేసీఆర్‌తోనే సాధ్యమని సిరికొండ పేర్కొన్నారు. ఆయన వెంట వరంగల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, మండల పార్టీ అధ్యక్షుడు పిట్టల మహేందర్, సొసైటీ వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, నాయకులు తంగెడ మహేందర్, తంగెడ నగేశ్, కడారి రాజు, గొల్లె మహేందర్, కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, దుగ్యాని సమ్మయ్య, జూపాక జడ్సన్, ఎండీ మదార్, రాజేశ్వర్‌రావు, సాంబమూర్తి, కోరె రాజుకుమార్, చిట్టిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సకల సౌకర్యాలు కల్పిస్తున్నాం

**వొడితెల సతీశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే**

ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు వచ్చే పార్టీ శ్రేణులు, ప్రజల కోసం సకల సౌకర్యాలు కల్పిస్తున్నాం. అన్ని ప్రాంతాల నుంచి వచ్చే అభిమానులు, కార్యకర్తల వాహనాల పార్కింగ్‌కు స్థలాలను ఇప్పటికే గుర్తించి తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ముఖ్యంగా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి కేసీఆర్ ప్రసంగం వినేందుకు ఆసక్తి చూపుతున్నారు. కేసీఆర్ సార్‌ను చూసేందుకు ముందుగానే వచ్చి ముందు వరుసలో ఉంటామని ప్రజలు చెబుతున్నారు. కేసీఆర్ మాట, సందేశం వినేందుకు సకల జనులు ఎదురుచూస్తున్నారు. తప్పక ఈ సభ చరిత్రలో నిలిచిపోతుంది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే ప్రజల కోసం వలంటీర్లను నియమించి సకల సదుపాయాలు కల్పిస్తున్నాం.



పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పక్కన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

# పండుగను తలపించాలి

- రజతోత్సవ సభకు ప్రజలను తరలించాలి
- గులాబీ వేడుకను విజయవంతం చేయాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హసన్‌పర్తి, ఏప్రిల్ 13 : ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ పండుగను తలపించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. లక్షలాదిగా ప్రజలను తరలించి విజయవంతం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. హనుమకొండలోని దయాకర్‌రావు నివాసంలో ఆదివారం గ్రేటర్ వరంగల్ ఒకటో డివిజన్ అధ్యక్షుడు నరెడ్ల శ్రీధర్ అధ్యక్షతన 1, 2వ డివిజన్ల బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ సభను విజయవంతం చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా 100 సీట్లు బీఆర్‌ఎస్ గెలుచుకుంటుందని జోస్యం చెప్పారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులే శ్రీరామ రక్షగా ఉంటాయన్నారు. పార్టీకోసం పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. సాగు నీరు, కోతలు లేని కరెంట్, రైతుబంధు, రైతు బీమా అందించిన గొప్ప విజన్ ఉన్న నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. రైతు భరోసా ఎగ్గొట్టి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టాలని సూచించారు. సమావేశంలో కార్పొరేటర్లు రవినాయక్, ఇండ్ల నాగేశ్వర్‌రావు, ఇన్‌చార్జి రాంమూర్తి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ గండు అశోక్‌యాదవ్, జిల్లా నాయకులు గనిపాక విజయ్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**పార్కింగ్ స్థలాల పరిశీలన**

రజతోత్సవ సభ సందర్భంగా హైదరాబాద్, రంగారెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి వచ్చే వాహనాలను పార్కింగ్ చేయడం కోసం మండలంలోని అనంతసాగర్, మడిపల్లి గ్రామ శివారులోని స్థలాలను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి దయాకర్‌రావు ఆదివారం పరిశీలించారు. వారి వెంట పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాడి మాల్లారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బండి రజినీకుమార్, మాజీ ఎంపీటీసీ ఇంద్రయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు రాజు తదితరులు ఉన్నారు.

# సభను విజయవంతం చేయాలి

**భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి**

టేకుమట్ల, ఏప్రిల్ 13 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం పరకాలలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం నుంచి అధిక సంఖ్యలో బీఆర్‌ఎస్ నాయకులు సభకు తరలి వచ్చేలా చూడాలన్నారు. ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజలకు తెలియజేస్తూ, కేసీఆర్ చేసిన అభివృద్ధిని గుర్తు చేస్తూ సభకు జనాలను తరలించాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి గౌడ్, మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, ఆకునూరి తిరుపతి, మాజీ ఎంపీపీ బందెల నరేశ్, ఆది రఘు పింగిళి వెంకటేశ్వర్‌రెడ్డి, పోతనవెన ఐలయ్య, బొడ్డు సదానందం, ఉద్దమారి మహేశ్, కొలిపాక రాజయ్య, బిలకండి ఉపేందర్‌రావు, చదువు మహేందర్‌రెడ్డి, నల్లబెల్లి రవీందర్, పొన్నం చంద్రయ్య, కోఆప్షన్ సభ్యులు మహ్మద్ అఫ్జల్, చేరికు రాజిరెడ్డి, ప్రభాకర్‌రావు, దొడ్ల కోటి, జీ లక్ష్మణ్, డీ రవి, ఉపసర్పంచ్ చంద్రగిరి సంపత్, చెలకని శంకర్, అక్రమ్, ఎం రాజు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ నాయకులతో సమీక్ష నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డులో నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని కుప్ప చేస్తున్న రైతులు



ఏటూరునాగారం: మిర్చిపై కప్పిన టార్పాలిన్ షీట్లపై నిలిచిన నీరు



జనగామ రూరల్: సిద్దెంకిలో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళ



ఏటూరునాగారం: ఇంటిపై కూలిన తాటి చెట్టు

**అకాల వర్షాలు** అన్నదాతలను ఆగమాగం చేస్తున్నాయి. ఆఖరి తడికి సాగునీరందకపోయినా అష్టకష్టాలు పడి పండించుకున్న ధాన్యాన్ని అమ్మకానికి తెస్తే వరద పాలైంది. ఆదివారం కురిసిన వడగండ్ల వానతో జనగామ, ములుగు జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురుగాలులకు వరి, మక్కజొన్న పంటలు నేలవాలగా, కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసింది. పలుచోట్ల మామిడి పంట దెబ్బ తిన్నది. జనగామ మార్కెట్‌లో వరద ధాటికి ధాన్యం అంతా కొట్టుకుపోయి రైతన్నకు కన్నీరే మిగిలింది.

- జనగామ, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ)/ ఏటూరునాగారం/మంగపేట

# మళ్లీ వాన.. తప్పని హైరానా

**ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల వడగండ్ల వర్షం**

- జనగామ మార్కెట్‌లో వరదకు కొట్టుకుపోయిన ధాన్యం
- అమ్మకానికి తెచ్చిన వడ్లు వరదపాలై రైతుల కన్నీరు
- ములుగు జిల్లాలో తడిసిన మిర్చి, నేలవాలిన వరి
- అకాల వర్షాలతో ఆగమవుతున్న అన్నదాతలు

జనగామ జిల్లాలోని జనగామ రూరల్, నర్మెట, తరిగొప్పుల, దేవరుప్పుల తదితర మండలాల్లో ఉరుములు, ఈదురుగాలులతో మోస్తరు వాన కురిసింది. మామిడితోటలకు నష్టం వాటిల్లగా కోతకు వచ్చిన వరి పంట నేలపాలైంది. జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డులో అమ్మకాని తెచ్చిన వందలాది ధాన్యం బస్తాలు, ఆరబోసుకున్న వడ్లు తడిసి ముద్దయ్యాయి. మార్కెట్‌కు సెలవు ప్రకటించడంతో రేపోమాపో బస్తాలు నింపి అమ్ముకుందామని కుప్పపోసుకొని టార్పాలిన్లు కప్పుకున్న రాశుల చుట్టూ వరద నీరు నిండి చెరువును తలపించింది. వరదలో కొట్టుకుపోయిన ధాన్యాన్ని నీటి మధ్య నుంచి తోడుకొని మళ్లీ కుప్ప చేసుకునేందుకు రైతుల పడరాని పాట్లు పడ్డారు. తేమ శాతం ఎక్కువ ఉందని వ్యాపారులు కొనుగోలుకు నిరాకరించడంతో రైతులు యార్డులో ఎండబోసుకోగా ఇంతలో వర్షం వచ్చి నిండా ముంచింది. పలుచోట్ల కొనుగోలు కేంద్రాలకు చేర్చిన ధాన్యం కూడా తడిసింది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం, తాడ్వాయి మండలం, మంగపేట మండలం కమలాపురం, గంపోనిగూడెం, మంగపేట, రేగులగూడెం బోరునర్సాపురం తదితర గ్రామాల్లో ఆదివారం గాలి దుమారంతో పాటు వడగండ్లు కురిశాయి. మిర్చి, వరి పంటలకు నష్టం వాటిల్లింది. ఆరబోసిన మిర్చిపై టార్పాలిన్ షీట్లు కప్పుకున్నారు. కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిముద్దయింది. కోతదశలో ఉన్న వరి పొలాలు ఈదురు గాలులకు నేలవాలాయి. రెండోసారి కోసిన మిర్చి కూడా తడిసిపోయింది. అలాగే వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కేశవాపురం, ఆరెగూడెం తదితర గ్రామాల్లో వడగండ్ల వర్షం పడి వరి, మక్కజొన్న, మామిడి పంటలు దెబ్బతిన్నాయి.



జనగామ రూరల్: సిద్దెంకిలో కురిసిన వడగండ్లు



రాయపర్తి: కురిసిన వడగండ్లు



దేవరుప్పుల: సీత్యాతండాలో రాళ్లవానకు నేలరాలిన ధాన్యం



మంగపేట: కమలాపురం శివారులో నేలవాలిన వరిపంట



మంగపేట: ధాన్యం తడవకుండా టార్పాలిన్ కప్పుతున్న రైతులు

# నకిలీ హాల్‌మార్క్ ముద్రలపై ఆరా

- అవసరానికి మించి వెలసిన సెంటర్లపై దృష్టి
- పూర్తిస్థాయి వివరాలు సేకరిస్తున్న నిఘా వర్గాలు



వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 13 : వరంగల్ నగరంలోని బంగారం వ్యాపారాన్ని కుదిపేస్తున్న నకిలీ హాల్‌మార్క్ ముద్రల వ్యవహారంపై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి. బంగారు ఆభరణాల తయారీదారులు తప్పని సరిగా హాల్‌మార్క్ ముద్రలు వేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిబంధనతో హాల్‌మార్క్ సెంటర్ల నిర్వాహకులు కొందరు మోసాలకు పాల్పడుతున్న విషయంపై వివరాలు సేకరిస్తున్నాయి. ప్రస్తుతం నగరంలో అవసరానికి మించి హాల్‌మార్క్ సెంటర్లు ఏర్పాటు కావడాన్ని పరిగణలోకి తీసుకొని మరింత లోతుగా అన్వేషిస్తున్నట్లు తెలుస్తున్నది. హాల్‌మార్క్ సెంటర్లు పాటించాల్సిన నిబంధనలు, అవసరానికి మించి సెంటర్లు ఏర్పాటు కావడం, వాటి నిర్వాహకుల తీరు, పరీక్షల నిర్వహణపై కూడా సమాచారాన్ని సేకరిస్తున్నారు. హాల్‌మార్క్ సెంటర్లలోనే ఇతరత్రా వ్యాపార లావాదేవీలు నిర్వహించడంపై కూపీ లాగుతున్నారు. నిబంధనలు అతిక్రమించి వేసిన హాల్‌మార్క్ ముద్రలు, నాణ్యతా ప్రమాణాల్లో వచ్చిన మార్పులపై వివాదాలు, పోలీస్ స్టేషన్ వరకు చేరిన గొడవలు, మధ్యవర్తిత్వం చేసిన బడా వ్యాపారుల వివరాలు సేకరిస్తున్నారు.

# స్వగ్రామానికి క్షేమంగా మయన్మార్ బాధితులు

మహాముత్తారం, ఏప్రిల్ 13 : ఏజెంట్ల మోసంతో మయన్మార్ ఆర్మీ చేతికి చిక్కిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలానికి చెందిన బాధితులు కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆదివారం క్షేమంగా తిరిగి వచ్చారు. మండలంలోని నిమ్మగూడెం గ్రామానికి చెందిన అజ్మీరా సంతోష్, దొబ్బలపాడుకు చెందిన లావుడ్యా విజయ్ ఉద్యోగం కోసం బ్యాంకాక్ వెళ్లాలనుకున్నారు. వారి నుంచి పాస్ ఫొటోలు, ఇతర పత్రాలు తీసుకున్న ఏజెంట్లు మయన్మార్ తీసుకెళ్లి రెండు నెలల పాటు కూలీ పనులు చేయించి పరారయ్యారు. దీంతో అక్కడి ఆర్మీ చేతిలోబందీలైన యువకులు పడుతున్న కష్టాలు తెలుసుకున్న కుటుంబ సభ్యులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిసి వారిని తిరిగి తీసుకురావాలని వేడుకున్నారు. ప్రత్యేక చొరవ తీసుకున్న సంజయ్ మయన్మార్ ప్రభుత్వాన్ని సంప్రదించి స్వదేశానికి తీసుకొచ్చేలా కృషి చేయడంతో సదరు యువకులు వారి ఇళ్లకు చేరుకోగా, కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# బయ్యక్కపేట అడవుల్లో పెద్దపులి సంచారం



పులి జాడ కోసం గాలిస్తున్న అటవీ శాఖ అధికారులు

- ఈ నెల 11న ఆవుపై దాడి
- కెమెరా ట్రాప్‌ల ఏర్పాట్లు, ముమ్మరంగా గాలింపు చర్యలు



ఆవు చనిపోయిన ప్రాంతంలో గుర్తించిన పులి పాదముద్రలు

తాడ్వాయి, ఏప్రిల్ 13 : బయ్యక్కపేట అడవుల్లో నాలుగు రోజులుగా పులి సంచరిస్తోంది. మూడు రోజుల క్రితం ముసలమ్మపెంట గొత్తికోయగూడేనికి చెందిన రైతు సత్తయ్య ఆవు మేతకు వెళ్లగా దాడి చేసి చంపేసింది. అటవీ అధికారులకు సమాచారం అందించడంతో అప్పటినుంచి పులి జాడ కోసం అధికారులు గాలిస్తున్నారు. ప్రస్తుతం పులి బయ్యక్కపేట అడవుల్లోనే ఉన్నట్లు గుర్తించారు. దాని జాడ కనుగొనేందుకు ఐదు చోట్ల కెమెరా ట్రాప్‌లు అమర్చారు. పులికి ఎవరూ హాని తలపెట్టవద్దని బయ్యక్కపేట, గొత్తికోయగూడెం సహా పరిసర గ్రామాల ప్రజలకు అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు, నష్టం జరిగితే అటవీ శాఖ ద్వారా పరిహారం చెల్లిస్తామని హామీ ఇస్తున్నారు. ఈ నెల 11న ఆవుపై దాడి చేసిన పులి జాడ మళ్లీ కనిపించకపోవడం, ఇతర జిల్లాల అడవులకు వెళ్లిన ఆనవాళ్లు లేకపోవడంతో బయ్యక్కపేట అడవుల్లోనే ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. పులి జాడ కోసం అన్వేషిస్తున్నామని, ప్రజలు దాడికి గురికాకుండా అప్రమత్తం చేస్తున్నామని అధికారులు చెప్పారు.